మా సమస్యలను
ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

వృత్తి నైపుణ్య శిక్షణ టైపు రైటింగ్, షార్ట్ హాండ్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభు త్వ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ తెలంగాణ రిక్రగ్నైజేషన్ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్, కంప్యూ టర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నతీష్ శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్ రావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.
– హిమాయత్ నగర్ , మార్చి21:

విలువ ఆధారిత..

విద్య కోసం కృషి

యూనివర్సిటీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు ప్రకాశ్ భాయ్ పటేల్ తదితరులు

బంజారా హిల్స్, మార్చి 21: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు, సరైన ఉపాధి అందించే కోర్సులపై తమ యూనివర్సిటీ ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుందని సంకల్ చంద్ పటేల్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రకాశ్‌భాయ్ పటేల్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లో నూతనంగా ఏర్పాటు చేసిన యూనివర్సిటీ దక్షిణాది రీజినల్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. చారిటబుల్ ఆర్గనైజేషన్ ద్వారా నడుస్తున్న గుజరాత్‌కు చెందిన సంకల్పచంద్ పటేల్ యూనివర్శిటీ ద్వారా స్కిల్ బేస్డ్ విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన తమ యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న దక్షిణాది విద్యార్థుల సౌకర్యం కోసం హైదరాబాద్లో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ప్రపుల్ కుమార్ ఉదానీ, డా. పరిమళ్ త్రివేదీ, ప్రిన్సిపాల్ డా. పి.జె. పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మొదటిరోజు పది పరీక్షలు

- **తెలుగు పరీక్షకు పలువురు విద్యార్థులు గైర్హాజరు**
- **పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు**

హిమాయత్‌నగర్ , మార్చి 21: హిమాయత్‌నగర్ జోన్ పరిధిలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పలువురు విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ ఏడాది జోన్ నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 4,892 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకావాల్సి ఉండగా 4,886 మంది హాజరయ్యారు. కాగా ఆరుగురు విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు గైరాజరైనట్లు హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ విద్యా శాఖాధికారిణి ఆస్రా ఫాతిమా తెలిపారు. పరీక్ష సమయంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు. చంద్రశేఖర్ చెప్పారు.

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో..

మైలార్‌దేవ్‌పల్లి: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చి కేంద్రాల వద్ద పుస్తకాలతో కుస్తీ పడడం కనిపించింది. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే చివరి క్షణం వరకు విద్యార్థులు చదువుతూనే కనిపించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన మొదటి రోజు పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది.

యూసుఫ్‌గూడలో పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులతో కిక్కిరిసిన ప్రాంగణం

యూసుఫ్‌గూడ సెంటర్‌ను సందర్శించిన డీఈఓ..

జూబ్లీహిల్స్: పదో తరగతి పరీక్షలు ఖైరతాబాద్ జోన్‌లో మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల నిర్వహణను జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి, డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్‌లు వేర్వేరుగా పరిశీలించారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, వెంగళరావు నగర్, బోర బండ, ఎర్రగడ్డ తో పాటు 17 ఉన్నత పాఠశాలలు, 2 ఎయిడెడ్, 4 మైనార్టీ రెసిడెన్షియల్, 4 గురుకుల పాఠశాలలు, 3 రెసిడెన్షియల్ పాఠశాలల తో పాటు 144 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. జోన్ పరిధిలో 35 పరీక్ష కేంద్రాలలో 35 మంది చీఫ్ సూపరిండెండెంట్ లు, 40 మంది సిట్టింగ్ స్క్వాడ్ తో పాటు 25 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

యూసుఫ్‌గూడ పరిధిలో..

జూబ్లీహిల్స్: పదో తరగతి పరీక్షలకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడలోని పది పరీక్షలు జరుగుతున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏసీపీ వెంకట గిరి నేతృత్వంలో 3 అంచెల భద్రత ఏర్పాటు చేయడంతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

హిమాయత్ నగర్ లోని ఓ సెంటర్ వద్ద విద్యార్థులను తనిఖీలు చేస్తున్న దృశ్యం

పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో చర్చిస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

ప్రజాపాలనలో..ప్రజలను కలవరా..!

సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు ఉదయ్‌కుమార్

ఖైరతాబాద్, మార్చి 21: రాష్ట్రంలోని పాఠశాలలన్నీ అవసాన దశలో ఉన్నాయని రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ ఇంద్రానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొమ్ము ఉదయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేవని, ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, వసతి గృహాల్లో నాణ్యతలేని ఆహారంతో పిల్లలను అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. ఇక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేక తీవ్ర ఒత్తిడిలో ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించేందుకు తమ బృందం ఆయనను కలిసే ప్రయత్నం చేస్తే ఒక్కసారిగా కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం అని చెప్పుకొచ్చే సీఎం ప్రజలను ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు.

ఒక్కసారి కలిసేందుకు అవకాశం కల్పిస్తే తమ సమస్యలు వివరిస్తామన్నారు. తాను స్వచ్ఛందంగా తన పదవీకి వీఆర్ఎస్ ద్వారా విరమణ పొందుతున్నానని, దానిని ఆమోదించి, ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలని, పాఠశాలలను మెరుగుపరుస్తూ పెండింగ్ బిల్స్ నెల రోజుల్లో క్లియర్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

27న ఓయూలో పీడీఎస్‌యూ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీడీఎస్‌యూ సదస్సును ఈనెల 27న నిర్వహించనున్నారు. వాల్‌పోస్టర్‌ను ఆర్ట్స్‌కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుబ్బా రంజిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తితోనే విద్యా రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

యువతకు భగత్ సింగ్ ఆదర్శం

హిమాయత్ నగర్ , మార్చి21: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర అన్నారు. భగత్ సింగ్ , రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా రూపొందించిన కటౌట్‌ను శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 న హిమాయత్‌నగర్ నుంచి రాంకోఠిలోని భగత్ సింగ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేశం కోసం నిస్వార్థంగా పోరాడిన భగత్ సింగ్‌అడుగు జాడలో యువత నడవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర నగర కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, నేతలు మాజీద్ అలీ ఖాన్, కల్యాణ్, వంశీ,విజయ్, హేమంత్, జగన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

బండ్లగూడ, మార్చి 21: రాజేంద్రనగర్ మహాత్మ జ్యోతిరావు పూలే నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జయంతి ఉత్సవాలు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కే కృష్ణమాచారి, మాజీ కమిటీ అధ్యక్షులు డి సత్యనారాయణ, తదితరుల సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. రాజేంద్రనగర్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా శివరాంపల్లి కి చెందిన బండారి శంకర్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ముడుమాల శ్రీకాంత్ ముదిరాజ్, కోశాధికారు లుగా పుంజాల శ్రీనివాస్ గౌడ్, వి చందు, మీడియా సెల్ కన్వీనర్ గా బుడిగెల బాబురావు లను ఎన్నుకున్నారు.

నూతన అధ్యక్షుడు బండారి శంకర్

సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు

పుప్పాలగుడా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నగర్ వీధులలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, మార్చి 21 : గుడ్ మార్నింగ్ మణికొండలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పుప్పాలగుడా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నగర్ వీధులలో ప్రజాభిప్రాయ సేకరణలో అడుగడుగునా సమస్యలే దర్శనమిస్తున్నాయంటూ ప్రజలు నాయకుల ముందు వాపోయారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్, హైదరాబాద్ వాటర్ వర్క్స్ హెచ్.ఎం.డి.ఏ, మణికొండ మున్సిపాలిటీ అధికారులందరూ పై సమస్యలకు పరిష్కార దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని మణికొండ బీఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నామని అధ్యక్షుడు సీతా రాం ధూళిపాళ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుంభగల్ల ధనరాజ్, గుట్ట మీది నరేందర్, ఉపేందర్నాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, దిలీప్, కిరణ్ యాలాల, భానుచందర్, సుమనశ్రీని, సుమన్, బొడ్డు శ్రీధర్, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో సింపోజియం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలలో వేరువేరు పేర్లతో జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్టివల్ (సింపోజియం) ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీలు శుక్రవారం ప్రారంభమై రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ సింపోజియంలను అధ్యాపకులతో సంబంధం లేకుండా ఆయా విభాగాల విద్యార్థులే అధ్యాపకులు కేవలం సలహాదారులుగా వ్యవహరిస్తారని విద్యార్థులు వివరించారు. పరిశోధనల అనుభవాలను ఒక వేదికపై తీసుకువచ్చేందుకు ఈ సింపోజియంలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ప్రత్యేక కోర్సుల అధ్యయనానికి ఒప్పందం

ముషీరాబాద్: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేపీ 21 ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీల మధ్య కోర్సుల సహకారానికి పరస్పర ఒప్పందం కుదిరింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె .ప్రభుతో వివిధ కోర్సుల్లోలో పరస్పర సహకారానికి శుక్రవారం ఒప్పందం జరిగింది. ప్రభుత్వ పాల నాశాస్త్ర విభాగాలు సంయుక్తంగా సమన్వ యం చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా న్యాక్ ఫౌండేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కరెంట్ అఫైర్స్, సాఫ్ట్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో విద్యార్థులకు తర్ఫీదును ఇవ్వనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్, మార్చి 21: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఫిలింనగర్ రోడ్డు నంబర్ 9 లోని అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉండే ఏటూరు భీమయ్య (40) పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తుంటాడు. భార్య సంతోషి హౌస్ కీపింగ్ పనిచేస్తుండగా, ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. గురువారం సంతోషి పనికి వెళ్లగా ముగ్గురు పిల్లలు స్కూలుకు వెళ్లారు. సాయంత్రం 7:30 ప్రాంతంలో డ్యూటీ నుంచి తిరిగిచ్చి చూడగా భర్త భీమయ్య నిద్రపోతూ కనిపించాడు. అతడిని నిద్ర నుంచి లేపి పనికి వెళ్లలేదా అని అడగ్గా సమాధానం చెప్పలేదు. దాంతో తల్లికి ఫోన్ కాల్ చేసేందుకు బయటికి వెళ్ళిన భార్య రెండు గంటల తర్వాత ఇంట్లోకి వచ్చింది. భీమయ్య గదిలోకి తొంగి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించాడు. దీంతో గట్టిగా కేకలు వేసి స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి కిందకు దించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. కొంతకాలం నుంచి ఆర్థిక సమస్యలు ఉన్నాయని, దానివల్లనే ఆత్మహత్య చేసుకుని ఉంటారని భీమయ్య భార్య సంతోషి ఫిలిం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు పోలీసులు.

యువతి పట్ల అసభ్య ప్రవర్తన -కేసు నమోదు

బంజారాహిల్స్,మార్చి 21: యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. రహమత్‌నగర్ ప్రాంతానికి చెందిన యువతి (26) జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని హోటల్లో కస్టమర్ రిలేషన్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. అక్కడే హౌస్ కీపింగ్ పనిచేసే ఆనంద్ కుమార్ శ్రీ వాస్తవ్ అనే వ్యక్తి ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. గట్టిగా కౌగిలించుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయగా అక్కడినుంచి పోయాడు. జరిగిన విషయం గురించి ఎవరికైనా చెప్తే అంతు చూస్తానంటూ హెచ్చరించాడు. అతడి వ్యవహారంపై యువతి యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. రెండు రోజులు గడిచినా నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధిత యువతి శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడు ఆనంద్ కుమార్ శ్రీవాస్తవ మీద బీఎన్ ఎస్ 75(1)79,351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిల్లు కట్టకుంటే..కరెంట్ కట్ చేస్తాం

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగికి సైబర్ కేటుగాళ్ళ టోకరా

రూ.57 వేలు దోచుకున్న సైబర్ నేరగాళ్లు

వెంగళరావునగర్, మార్చి 21 : విద్యుత్ బిల్లు బకాయి ఉంది. బిల్లు కట్టకుంటే మీ విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామంటూ వచ్చిన మెసేజ్‌ను చూసి నిజమే అనుకొని భావించిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగికి లింక్ పంపి.. అకౌంట్ లోని డబ్బంతా సైబర్ కేటుగాళ్ళు దోచేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం బి.కె.గూడలో నివాసం ఉండే ఎస్.వెంకట్రావు (82) సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. ఈనెల 2న సాయంత్రం వెంకట్రావు ఫోన్ కు ఓ నెంబర్ నుంచి ఓ మెసేజ్ వచ్చింది. బిల్లు బకాయి చెల్లించకుంటే మీ విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని సందేశం వచ్చింది.ఆందోళన చెంది ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే మీరు బిల్లు వెంటనే కట్టాలని సూచించి వాట్సప్‌లో ఏపీకే ఫైల్ లింక్ పంపారు.

ఆ లింక్‌ను క్లిక్ చేయగానే అతడి అకౌంట్ నుంచి రూ.57, 485 వేలు మూడు విడతల్లో కాజేశారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఎస్. ఆర్. నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీల్‌చైర్ అందజేత

పేద విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు బాలకోటిరెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని శ్రీ విద్యానికేతన్ హై స్కూల్‌లో చదువుతున్న నిరుపేద విద్యార్థికి శుక్రవారం వీల్ చైర్‌ను విరాళంగా అందజేశారు. గత నెలలో పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో విద్యార్థినికి వీల్‌చైర్ అవసరం ఉందని గుర్తించి అందించడం జరిగిందన్నారు. మహిళా సాధికారత, సమాజ ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల దృష్టితో రోటరీ క్లబ్ ప్రతి నెల వైద్య శిబిరాలను నిర్వహించి పేద మహిళలు, బాలికలకు కుట్టు మిషిన్‌లు, సైకిల్స్, వీల్ చైర్స్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ వీసీరెడ్డి, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజాకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 21:

దుర్వాసనలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలి

అమీర్‌పేట్,మార్చి 21: బాచుపల్లి, మల్లంపేట ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య కారక దుర్వాసనల ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం టీజీపీసీబీ ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. కాజిపల్లి గడ్డపోతారం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పరిశ్రమల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో టీజీపీసీబీ కి చెందిన జేసీ ఈఈ, ఆర్‌సీ పురం జోనల్ అధికారులు పాల్గొన్నారు. అన్ని పరిశ్రమలు దుర్వాసన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, వీఓసి స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి మనిషికి క్రమ శిక్షణ అవసరం

వ్యవసాయ యూనివర్సిటీ,(హైదరాబాద్) మార్చి 21 :ఆయా అంశాలపై ఎంత అవగాహన ఉన్నప్పటికీ, శిక్షణ మరింత దోహదపడుతుందని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫ్యాకల్టీ సభ్యుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి మనిషికి తన జీవితకాలంలో ఆయా అంశాలపై శిక్షణ ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు ఎంతో తెలుసని అనుకున్నప్పటికీ ఆయా అంశాలపై అవగాహన ఉన్నవారితో శిక్షణ కార్యక్రమాలు చేపట్టడంతో జీవితంలో ఆయా అంశాలపై అనుభవాన్ని పెంచుతుందన్నారు. విషయ పరిజ్ఞానంతో పాటు సమయపాలన, నీతి నిజాయితీ వృత్తి పరంగా ఎంతో దోహదపడుతుందన్నారు. వర్సిటీ పరిధిలోని రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ కళాశాలల ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె ఝాన్సీ రాణి, పీజీ స్టడీస్ డాక్టర్ ఈశ్వరి ,సెంటర్ ఫర్ హ్యూమన్ రీసెర్చ్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేష్, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రీతి పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ అంశంపై తమకు అవగాహన ఉందని, క్లాసులు నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక అంశాలపై అవగాహన కోల్పోతారని ఆయన సూచించారు. విధిగా ప్రతి ఒక్కరూ క్లాసులను సద్వినియోగపరచుకొని అవగాహనతో ఉండాలని ఆయన సూచించారు.

పుప్పాల్‌గూడలో.. గంజాయి కలకలం

మణికొండ, మార్చి 21 : నగర శివారు ప్రాంతంలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి ముఠా కలకలం. కొన్ని రోజులుగా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా కేంద్రాల్లో రోజుకోటి వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా లేబర్ క్యాంపులు పలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లతో పాటు గ్రామాల్లోని గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగుతుండడం విశేషం. ఇటీవల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఏకంగా మూడు కిలోల గంజాయి సంచిని ఎస్ఓటీ పోలీసులు పట్టుకోగా, కోకాపేట గ్రామంలోని 450 గ్రాములు గంజాయిని విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఇది మరవక ముందే పుప్పాలగూడలో శుక్రవారం 650 గ్రాముల గంజాయి సీజ్ చేసినట్లు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రయిస్తుండగా శ్రీకాంత్ అనే యువకుడిని పుప్పాలగూడలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు.ఈ మేరకు శ్రీకాంత్‌పై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అరకు నుంచి గంజాయి తెచ్చినట్లు పోలీసుల ముందు నిందితుడు ఒప్పుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

ట్యాంకర్ డ్రైవర్ల మధ్య గొడవ

ఇరు వర్గాలపై కేసు నమోదు

బంజారా హిల్స్, మార్చి 21: అకారణంగా గొడవకు దిగి న్యూసెన్స్‌కు పాల్పడుతున్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలకు వెళ్తే.. వెంకటగిరి జలమండలి వాటర్ ట్యాంకు వద్ద ట్యాంకర్ డ్రైవర్లు వాటర్ ఫిల్లింగ్ విషయంలో పరస్పరం గొడవలకు దిగుతూ పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు వాటర్ ట్యాంకు వద్దకు చేరుకొని పరిశీలించగా ట్యాంకర్ డ్రైవర్లు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటూ గొడవ పడుతున్నారు. గతంలో కూడా రెండు గ్రూపుల మధ్య బంజారాహిల్స్ జల మండలి వద్ద గొడవలు జరిగాయని, ఎన్నిసార్లు చెప్పినా పద్ధతులు మార్చుకోవట్లేదని గుర్తించిన పోలీసులు రెండు వర్గాలకు చెందిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్లు ఈ.ప్రవీణ్, రాజు, సంపత్, రంజిత్, సందీప్ పై బీఎన్ఎస్ 194(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురు అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 21: రోడ్డుమీద వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసి డబ్బులు గుంజుకున్న ఘటనలో ముగ్గురు యువకులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్